క్లుప్తంగా

భూ సర్వే వేగవంతం



హద్దులు పోల్చుతున్న సర్వేశాఖ ఎ.డి త్రివిక్రమరావు, తదితరులు

పూసపాటిరేగ: భూ సర్వే వేగవంతం చేయాలని సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ త్రివిక్రమరావు అన్నారు. మండలంలోని చింతపల్లి, బరిణికాం గ్రామాలలో జరుగుతున్న భూముల రీసర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హద్దులు నిర్ణయించి సకాలంలో రాళ్లు వేయాలని సూచించారు. హద్దులు నిర్ణయించడం వల్ల ఎంతో కాలంగా ఉన్న భూ తగాదాలకు చెక్ పెట్టవచ్చన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ లోపు మండలంలోని 22 సచివాలయాల పరిధిలో భూసర్వేతో పాటు సర్వే రాళ్లు ఏర్పాటు పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గణపతిరావుతో పాటు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమొంటో అందజేస్తున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాని రాష్ట్ర బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో విజయదుర్గ యూత్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందించాలని తెలిపారు. కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ వజ్రపు సత్యగౌరీ, పట్నాల భవానీ, పీవీ పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరువలేం..



మహంతి అప్పలరాములు

డెంకాడ: కౌలురైతులకు వైఎస్సార్ రైతుభరోసా అందించి సహకరిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరువలేమని మండలంలోని లంకపేటకు చెందిన మహంతి అప్పలరాములు అన్నారు. కౌలురైతులకు రైతుభరోసా అమలు చేయడం ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని పండగలా మార్చిన మహానుభావుడు జగనన్న రుణం తీర్చుకోలేదన్నారు. నిరాదరణకు గురైన కౌలురైతులను ఆదుకోవాలన్న లక్ష్యంతో జగన్ మోహన్‌రెడ్డి పనిచేయడం అభినందనీయమని చెప్పారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

కొత్తవలస: న్యాయవాదులపై ఇటీవల జరుగుతున్న దాడులకు నిరసనగా కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడాన్ని కొత్తవలస బార్ అసోసియేసన్ తీవ్రంగా ఖండించింది. దేశంలో న్యాయవాదులకు రక్షణ కరువైయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎంవీ గిరిబాబు, డి.శ్రీనివాసరావు, సీహెచ్‌ఆర్ రామచంద్రరావు, నందిపల్లి శ్రీరామమూర్తి, గవర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: విజయవాడలో బార్‌అసోసియేషన్ మెంబర్‌గా ఉన్న టి.కిరణ్‌బాబు అనే న్యాయవాదిపై పోలీసులు అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ యాక్టు క్రింద కేసును నమోదు చేయడంపై స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం విధులను బహిష్కరించి కోర్టు ఆవరణంలో ఆందోళన చేపట్టారు. పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాలకు ఎంపికైన యువతకు సత్కారం

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ వద్ద శిక్షణ పొందుతూ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)లో ఉద్యోగాలు సాధించిన 12 మంది అభ్యర్థులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి హేమంత్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను సత్కరించారు. రన్ మిషన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి హేమంత్ నిరుద్యోగ యువతకు ఆర్మీ, పోలీస్, ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు ఫిజికల్ ఫిట్‌నెస్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు శిక్షణ తీసుకున్న వారిలో 120 మంది వరకు వివిధ విభాగాల్లో ఉద్యోగాలు సాధించినట్లు హేమంత్ తెలిపారు.

వరలక్ష్మీ నమోస్తుతే..



పూసపాటిరేగ: కోనాడలో వరలక్ష్మిదేవికి పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం టౌన్: పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న చదురుగుడి పైడితల్లి అమ్మవారు



విజయనగరం టౌన్: వనంగుడిలో పుష్పాలు, గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు



అమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు, సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకోవడంతో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంది. పూసపాటిరేగ మండలంలోని కోనాడ ఉమా రామలింగేశ్వర ఆలయంలో పండితుడు వాడ్రేవు నాగరాజుశర్మ భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని వనంగుడి, చదురుగుడిలో పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మయూరి కూడలి వద్దనున్న సంతోషిమాత ఆలయానికి మహిళా భక్తులు పోటెత్తారు. అదేవిధంగా కన్యకపరమేశ్వరి వజ్రకిరీటం, బంగారుచీరతో పాటు వివిధ రకాల పండ్ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లిమర్ల మండలం కొత్తపేటలో (చిన్న అన్నవరం) గల వీరవెంకట సత్యనారాయణ స్వామి వరలక్ష్మీ అమ్మవారు సంతాన లక్ష్మిగా పూజలందుకున్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



పైడితల్లిని దర్శించుకుంటున్న భక్తులు



సంతోషిమాత ఆలయంలో మహిళా భక్తులు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత



నెల్లిమర్ల: సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

విత్తనాలు తయారు చేసుకోవడం మేలు..



వరి పొలంలో విత్తనోత్పత్తిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

డెంకాడ: రైతులు తమ విత్తనాలు తామే తయారు చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలుంటాయని జిల్లా వనరుల వ్యవసాయశాఖ అధికారి టి.సంగీత, ఏఓ నిర్మల అన్నారు. మండలంలోని చొల్లంగిపేటలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా వరి పండించే రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించార. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులను విత్తనోత్పత్తి కేంద్రాలుగా తయారు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈకేవైసీ చేసుకోని రైతుల జాబితాలను ఆర్‌బీకేలు, సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. విచక్షణా రహితంగా పురుగు, తెగుళ్ల మందులు వాడడం వల్ల నష్టాలెక్కువని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు మహంతి నర్సినాయుడు, తొత్తడి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

నెల్లిమర్ల: నియోజకవర్గ కేంద్రమైన నెల్లిమర్లలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో రామతీర్థం జంక్షన్‌లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. పార్టీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి యువజన మాసోత్సవాలు



యువజన మాసోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ప్రతినిధులు

విజయనగరం: రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్న యువజన మాసోత్సవాలను ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు క్లబ్ యూత్ సర్వీస్ డైరెక్టర్ బలభద్రుని అశోక్ తెలిపారు. శుక్రవారం స్థానిక రోటరీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువజన మాసోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యవజన మాసోత్సవాల్లో సుమారు 15 వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రోటరీ క్లబ్ మంచి వేదిక అని, నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి క్లబ్ జిల్లా గవర్నర్ దత్త సుబ్బారావు చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ శంకర్‌రెడ్డి, అధ్యక్షుడు ఉడతా రాజేష్, కార్యదర్శి అరుణ్ సోదాని, పూసర్ల మారుతి, భువన్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమన్నశెట్టి అన్నారు. నగరంలోని 40వ డివిజన్ 48వ సచివాలయం పరిధిలోని కంటోన్మెంట్ బొగ్గులదిబ్బ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో విజయనగరం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ దూబే, డివిజన్ అధ్యక్షుడు వాసుదేవరావు, మహిళా అధ్యక్షురాలు నందిని, యువజన అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పాలసీదారులకు మెరుగైన సేవలు

- ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ



డీవీజీ శంకరరావును సత్కరిస్తున్న ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ నారాయణరావు, తదితరులు

విజయనగరం టౌన్: పాలసీదారులకు నమ్మకమైన, మెరుగైన సేవలందించడంలో జీవితబీమా సంస్థ (ఎల్ఐసీ) ముందంజలో ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. 67వ జీవిత బీమా వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్డులో ఉన్న బ్రాంచ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎల్ఐసీ ఒక సేవా సంస్థ మాదిరిగా పనిచేస్తుండడం అభినందనీయమన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పాలసీదారుల పక్షాన రక్షణ కవచంగా నిలిచి, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా డెత్ క్లయిమ్‌లను సకాలంలో పరిష్కరించిన ఘనత ఎల్ఐసీదేనన్నారు. అనంతరం శంకరరావును బ్రాంచ్ మేనేజర్ ఎస్.నారాయణరావు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అంజయ్య, ఏఓ కట్టమూరి భాస్కర రామమూర్తి, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, సీనియర్ డవలప్‌మెంట్ ఆఫీసర్లు జి.రవి శ్రీనివాస్, ఎంఎల్.శ్రీనివాస్, జేవీ నాగరాజు, సునీల్ కుమార్‌తో పాటు ఏజెంట్ల సంఘ అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యుగ పురుషుడు ఆదిభట్ల



హరికథాచూడామణి బిరుదుతో పాటు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న ఈశ్వర్ కౌశిక్, తదితరులు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్
- మడమల రాంబాబుకు హరికథా చూడామణి బిరుదు ప్రదానం

విజయనగరం టౌన్: హరికథా గానంలో విజయనగర ఖ్యాతిని యావత్ ప్రపంచానికి తెలియజెప్పిన యుగపురుషుడు ఆదిభట్ల నారాయణదాసు అని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ పేర్కొన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఆదిభట్ల నారాయణదాసు ఉత్సవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 159వ జయంతి ఉత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిభట్ల చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఏటా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఇచ్చే రూ.5 వేల నగదు పురస్కారం, హరికథా చూడామణి బిరుదును మచిలీపట్నానికి చెందిన హరికథా భాగవతార్ మడమల రాంబాబు భాగవతులుకు ఈశ్వర్ కౌశిక్ ఈ సందర్భంగా అందజేశారు. కాపుగంటి ప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించిన సభా కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు చేతుల మీదుగా పువ్వాడ సత్య వెంకట భాస్కర్, కోలపల్లి దుర్గారామ సాయిబాబాలను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో నారాయణం శ్రీనివాస్, బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, భోగరాజు సూర్యలక్ష్మి, టి.సుధాకర్, కాళ్ల నిర్మల పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం



నూతన పింఛన్ లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

విజయనగరం: అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. నగరంలోని ఎనిమిది డివిజన్లకు సంబంధించి 590 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అద్భుతమైన పథకాలను అందిస్తున్నారన్నారు. నవరత్నాలు అమలులో భాగంగా పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ పేదల పక్షపాతిగా మన్ననలు అందుకుంటున్నారని తెలిపారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతుభరోసా, వాహనమిత్ర, విద్యాకానుక, విద్యాదీవెన వంటి అనేక పథకాలను అందిస్తున్న మనసున్న మారాజు జగనన్న అని కొనియాడారు. ఒకటో తేదీ ఉదయానికే పింఛన్ అందిస్తున్న చరిత్ర దేశంలో ఎక్కడా లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవర్ల కుమారస్వామి, బొంగు భానుమూర్తి, టీపీఆర్ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన కొనసాగుతోందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలో మొయిద గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 50 వేలకు పైగా కొత్త పింఛన్లు మంజూరు కాగా... నెల్లిమర్ల నియోజకవర్గానికి 798 కేటాయించారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామన్నారు. గతంలో ఒక లబ్ధిదారు చనిపోతేనే మరొకరికి పింఛన్ మంజూరు చేసేవారని తెలిపారు. నేడు అటువంటి పరిస్థితులు లేవన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని, వారికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: మొయిదలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్



నెల్లిమర్ల రూరల్ : కొత్తగా పింఛన్ అందుకున్న లబ్ధిదారులతో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, తదితరులు

నగర పంచాయతీకి 52 కొత్త పింఛన్లు ..

నెల్లిమర్ల: నగర పంచాయతీకి కొత్తగా 52 సామాజిక పింఛన్లు మంజూరైనట్లు కమిషనర్ పి. బాలాజీప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పట్టణంలోని 20 వార్డులకు సంబంధించి ఇప్పటివరకు 3,530 పింఛన్లు ఉన్నట్లు చెప్పారు. అదనంగా ప్రభుత్వం అర్హులైన మరో 52 మందికి మంజూరు చేసిందన్నారు.

కొండవెలగాడలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో కొత్తగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక సచివాలయంలో 11 మంది లబ్ధిదారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మొయిద అక్కోజి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామం జాతీయ రహదారి వద్ద బైక్‌ను వ్యాన్ ఢీకొట్టడంతో ఓవ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇనపసప్పల ప్రసాద్ (24) ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సమయంలో వెనుకనుంచి వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. తక్షణమే 108 వాహనం సహాయంతో గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రికి బాధితుడిని తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విజయనగరం ఆస్పత్రికి తీసుకువెళ్లారు.